క్లుప్తంగా

పారిశుద్ధ్య పనుల పరిశీలన

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో పారిశుద్ధ్య పనులను జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి గురువారం పరిశీలించారు. పెద్దపల్లి జిల్లా నుంచి బదిలీపై జిల్లాకు వచ్చిన ఆయన బుధవారం సాయంత్రం భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామిని దర్శించుకున్నారు. రాత్రికి ఇక్కడే బసచేసి గురువారం ఉదయం పట్టణంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అన్ని వీధుల్లో చెత్త సేకరించడంతో పాటు ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డుకు తరలించాలని సిబ్బందికి సూచించారు. ఆతర్వాత మచబోతుల చెరువు వద్ద నిర్మిస్తున్న చెత్త శుద్ధి కర్మాగారం పనులను పరిశీలించారు. గ్రామపంచాయతీ జూనియర్ కార్యదర్శి శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

గుండాల: మండల పరిధిలోని సాయనపల్లి–రంగాపురం మధ్య రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. రోడ్డు విషయంపై కొద్దిరోజుల క్రితం స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతి చేసినట్లు, ఆయన అధికారులతో మాట్లాడి రూ.6లక్షలు మంజూరు చేయించినట్లు పీఎస్ ఆర్ పీవీఆర్ మండల కోఆర్డినేటర్ ఎస్కె.ఖదీర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొడెం ముత్యమాచారి తెలిపారు. కార్యక్రమం ఎంపీటీసీ ఓ.కృష్ణారావు, పూనెం సమయ్య, సీనియర్ నాయకులు పాంబోయిన ముత్తయ్య, సీపీఐ మండల కార్యదర్శి వాగబోయిన రమేష్, టీజేఎస్ మండల అధ్యక్షుడు గోల్లేపల్లి రమేష్ పాల్గొన్నారు.

మదర్సాకు శంకుస్థాపన

మణుగూరురూరల్: మండలంలోని ముత్యాలమ్మనగర్ గ్రామపంచాయతీ మదీనానగర్‌లోని మక్కా మసీద్‌ప్రాంగణంలో మదర్సా నిర్మాణానికి ముస్లిం మతపెద్దలు, హజ్రత్ మౌలానా, మహమ్మద్ సయిద్ అహమ్మద్, సాహెబ్ ఖురిషిలు శంకుస్థాపన చేశారు. దారుల్ ఉలుమ్ అధ్యక్షతన ఇస్లామిక్ ధార్మిక బహిరంగ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మక్కా మజీద్ ప్రాంగణంలో మదర్సా నిర్మాణానికి పూనుకోవడం శుభపరిణామమన్నారు. ముస్లింలందరూ తమ పిల్లలందరినీ మదర్సాకు పంపాలన్నారు. అనంతరం ఖురాన్ కంఠస్థం పరిపూర్ణంగా పూర్తి చేసిన విద్యార్థులను అతిథులు సన్మానించారు. కార్యక్రమంలో మౌలానా, అబ్బాస్, సత్తార్ సాహెబ్, కరీం సాహెబ్, ఇనాయతుల్లా, మత పెద్దలు, ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీల పూజలు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని భ్రమరాంబసమేత మల్లికార్జున స్వామి ఆలయంలో కొత్తగూడెం, ఇల్లెందు డీఎస్పీలు రెహమాన్, రమణమూర్తి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన డీఎస్పీలకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతించి, వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై షాహీన, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్‌బంక్ ప్రారంభం

చర్ల: మండలంలోని సత్యనారాయణపురంలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోల్‌బంక్‌ను గురువారం సంఘం అధ్యక్షుడు మందపాటి అచ్యుత శ్రీనివాసవర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా సహకార సంఘం ముఖ్య కార్యనిర్వహణాధికారి డి.రామచంద్రప్రభు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు సంఘ అధ్యక్షులు, డైరెక్టర్లు మాట్లాడారు. సహకార సంఘాన్ని లాభాల బాటలో నడిపించేందుకు ఏర్పాటు చేసిన ఈ పెట్రోల్ బంక్ నిర్వహణలో ఎటువంటి అవకతవకలు చోటు చేసుకోకుండా కొనసాగించేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు.

పొదెంను కలిసిన కౌన్సిలర్లు

భద్రాచలం: కాంగ్రెస్ పార్టీలో చేరిన కొత్తగూడెం మున్సిపాలిటీ కౌన్సిలర్లు గురువారం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు పొదెం వీరయ్యను భద్రాచలంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగూడెం మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలపై చర్చించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మోతుకూరి ధర్మారావు, ఏనుగుల అర్జునరావు, ఎంపీటీసీ భద్రం, రామ్ లక్ష్మణ్, కౌన్సిలర్లు తంగెళ్ల లక్ష్మణ్, కాసుల వెంకట్, ఎంఏ రజాక్, కొండలు, మాదా శ్రీరాములు, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

సకాలంలో చేరుకోవాలి

అశ్వాపురం: రామభక్తుల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆస్థా పథకం ద్వారా నేడు కొత్తగూడెం రైల్వేస్టేషన్ నుంచి అయోధ్య వరకు వెళ్లే ప్రత్యేక రైలు.. మధ్యాహ్నం మూడు గంటలకు బయలుదేరుతుందని అయోధ్య యాత్ర రైలు ప్రముఖ్, బీజేపీ మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ముస్కు శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మండల పరిధిలోని మొండికుంటలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొత్తగూడెంలో మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి 4 గంటలకు డోర్నకల్, 4.30 గంటలకు మహబూబాబాద్‌కు, 6గంటలకు వరంగల్ చేరుకుంటుందన్నారు. అయోధ్య వెళ్లే రామభక్తులు సంబంధిత రైల్వేస్టేషన్లకు రెండు గంటల ముందే చేరుకుని రైల్వే అధికారులు ఇచ్చే ఐడీ కార్డులు తీసుకోవాలని ఆయన కోరారు.

రూ.లక్షలు వెచ్చించి.. ఆపై వదిలేశారు..

- నిరుపయోగంగా మారిన ప్రభుత్వ భవనాలు
- అద్దె భవనాల్లో సాగుతున్న కార్యాలయాలు
- వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్న ప్రజలు



సత్యనారాయణపురంలో నిర్మించి ప్రారంభించని గ్రంథాలయ భవనం



లక్ష్మీకాలనీలో ఏడేళ్ల క్రితం నిర్మించి వదిలేసిన వ్యవసాయశాఖ విత్తన గిడ్డంగి

చర్ల: మండలంలో పలు చోట్ల లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాలు ప్రారంభానికి నోచుకోకుండా నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు, వసతి గృహాలు, రైతుల అవసరాల కోసం నిర్మించిన పలు భవనాలు కనీసం ప్రారంభానికి కూడా నోచుకోవడం లేదు. దీంతో అవి ఆకతాయిలకు అడ్డాలుగా మారుతున్నాయి. శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల కళ్ల ముందే ఈ భవనాలు నిత్యం దర్శనమిస్తున్నప్పటికీ వీటి గురించి పట్టించుకున్నది లేదు.

మండల కేంద్రంలోని లక్ష్మీకాలనీ శివారులో సుమారు రూ.20 లక్షల రూపాయలతో రైతులకు ఉపయోగపడేలా వ్యవసాయశాఖ ద్వారా విత్తనాల గిడ్డంగిని నిర్మించారు. అయితే దీనిని నిర్మించి ఏడేళ్లు కావస్తున్నప్పటికీ దీనిలో ఒక్క బస్తా విత్తనాలు కూడా నిల్వ చేయలేదు. దీని నిర్మాణం పూర్తి చేయక ముందు నాటి నుంచే చర్లలో వ్యవసాయ శాఖ కార్యాలయానికి భవనం లేకపోగా అద్దె భవనాల్లోనే కార్యాలయాన్ని కొనసాగిస్తూ వచ్చారు. దీని నిర్మాణం పూర్తయిన తరువాత కూడా ఆ శాఖ కార్యాలయాన్ని అద్దె భవనాలలోనే కొనసాగిస్తూ వచ్చిన అధికారులు అటు తరువాత నిర్మించబడ్డ రైతు వేదికల్లోకి కార్యాలయాన్ని మార్చుకున్నారు. కాగా ప్రస్తుతం లక్ష్మీకాలనీలో నిర్మించిన విత్తనాల గిడ్డంగి ఏడేళ్లుగా నిరుపయోగంగానే ఉంటోంది.

ఇక ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో సుమారు 20 యేళ్ల క్రితం నిర్మించిన బీఎస్ఎన్ ఎల్ భవనం పరిస్థితి కూడా అదే విధంగా ఉంది. ఈ భవన నిర్మాణం పూర్తయ్యి ప్రారంభించేందుకు సిద్ధమవుతున్న సందర్భంలో సమీపంలో ఉన్న అప్పటి తహసీల్దార్ కార్యాలయాన్ని మావోయిస్టులు మందుపాతరలతో పేల్చి వేయడంతో అప్పటి బీఎస్ఎన్ఎల్ అధికారులు ఈ బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి కూడా మావోయిస్టులతో ముప్పు ఉండవచ్చుననే ఆలోచనతో అప్పుడు దానిని ప్రారంభించకుండానే వదిలి వేశారు. అటు తరువాత కనీసం దాని వైపు ఆ శాఖ అధికారులు కన్నెత్తి కూడా చూడకపోవడంతో అందులోని తలుపులు, కిటికీలు, ఇనుప సామగ్రితో పాటు విలువైన వస్తువులన్నీ అపహరణకు గురయ్యాయి. అదే విధంగా లింగాపురంపాడులో సుమారు రూ.50 లక్షలతో నిర్మించిన విద్యార్థులకు వసతిని కల్పించేందుకు నిర్మించిన వసతి గృహం పరిస్థితి కూడా అలానే ఉంది. దీనిని నిర్మించి కూడా ఆరేళ్లు కావస్తున్నప్పటికీ ఇది ప్రారంభానికి నోచుకోకపోగా, ప్రస్తుతం రాత్రి పూట మందుబాబులకు అడ్డాగా మారింది. ఇంకా గ్రంథాలయాల కోసమని మండలంలోని సత్యనారాయణపురం, దేవరాపల్లి, కలివేరు తదితర గ్రామాలలో నిర్మించిన భవనాలు కూడా నిరాదరణకు గురవుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలను నిర్మించే ముందు అధికారులు అది అక్కడ ఉపయోగపడుతుందా లేదా మరెక్కడయినా నిర్మిస్తే ఉపయోగపడుతుందా అనే ముందస్తు ఆలోచన లేకుండా హడావడిగా భవనాలు నిర్మిస్తే ఇలానే నిరుపయోగంగా మారుతాయంటూ పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజప్రతినిధులు చర్ల మండలంలో నిర్మించి నిరుపయోగంగా వదిలేసిన భవనాలను అద్దె భవనాల్లో కొనసాగుతున్న కార్యాలయాలకు వసతి గృహాలకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని, ఈ భవనాలు మరింత శిథిలం కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకురావాలి



చర్ల మండలంలో నిర్మించి ప్రారంభించకుండా వదిలేసిన ప్రభుత్వ భవనాలను వినియోగింలోకి తీసుకురావాలి. లక్షల రూపాయలు ఖర్చు పెట్టి నిర్మించిన ప్రభుత్వ భవనాలను నిరుపయోగంగా వదిలేయడంతో అవి ఆకతాయిలకు అడ్డాలుగా మారుతున్నాయి. తక్షణమే నిరుపయోగంగా ఉన్న భవనాలిన్నంటినీ ఉపయోగంలోకి తీసుకురావాలి

– రేగళ్ల సుధాకర్, చర్ల

కార్యాలయాలకు అప్పగించాలి



చర్ల మండలంలో ప్రభుత్వ భవనాలు లేక అద్దె భవనాల్లో చాలా కార్యాలయాలు నడుస్తున్నాయి. నిర్మించి నిరుపయోగంగా వదిలేసిన భవనాలన్నింటినీ అద్దె ప్రతిపదికన ప్రైవేటు భవనాల్లో నడిచే శాఖలకు అప్పగించాలి. తద్వారా ప్రైవేటు వారికి చెల్లించే అద్దె డబ్బులు ప్రభుత్వానికి మిగులుతాయి. ఈ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పిల్లి రమేష్, చర్ల

మున్సిపాలిటీని పంచాయతీలుగా మార్చండి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలను పంచాయతీలుగా మార్చాలని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. గురువారం అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా జీరో అవర్‌లో ఆయన మాట్లాడారు. పినపాక నియోజకవర్గం పూర్తి ఏజెన్సీ ప్రాంతం కావడంతో మున్సిపాలిటీలో ఎన్నికలు లేక పాలన, అభివృద్ధి అస్తవ్యస్తంగా మారిందన్నారు. 2005కు పూర్వం మేజర్ పంచాయతీగా ఉన్న మణుగూరును మున్సిపాలిటీగా మార్చడంతో కొందరు కోర్టులో కేసు వేశారని, నాటి నుంచి ఎన్నికలు జరగక 19 సంవత్సరాలుగా ఇక్కడ పాలకవర్గం లేకుండాపోయిందని ఆయన వివరించారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు పన్నులు కట్టలేక, ఉపాధిహామీ పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రాయిగూడెం, కమలాపురం, అన్నారం, కుంకుడుచెట్ల గుంపు నాలుగు గ్రామ పంచాయతీలుగా చేయాలని విజ్ఞప్తి చేశారు. మొదటిసారి అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడే అవకాశం కల్పించిన స్పీకర్, సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

రుణం మంజూరైనా ఇవ్వడం లేదు..

ములకలపల్లి: ట్రైకార్ ద్వారా రుణం మంజూరైనా ఇవ్వకుండా బ్యాంకర్లు ఇబ్బంది పెడుతున్నారని మండలంలోని నర్సాపురానికి సున్నం రవి ఆరోపించాడు. ములకలపల్లిలో గురువారం ఆయన మాట్లాడుతూ తన భార్య సున్నం ప్రేమలత పేరిట 2020–21లో ట్రైకార్ రుణానికి ఎంపికైనట్లు తెలిపాడు. వ్యవసాయ బోర్‌వెల్ నిమిత్తం రూ.లక్ష రుణం మంజూరు కాగా, జగన్నాథపురం ఏపీజీవీలో సంప్రదిస్తే తొలుత రూ.50 వేలు చెల్లించాలని చెప్పారన్నారు. కానీ తాము అంత డబ్బు చెల్లించలేమని చెప్పగా రుణం ఇవ్వలేదని వెల్లడించారు. ఏపీజీవీ మేనేజర్ నరేశ్‌ను వివరణ కోరగా సదరు మహిళకు భూ రికార్డులు సక్రమంగా లేకపోవడంతో రుణం మంజూరులో జాప్యం జరిగిందని, త్వరలోనే ఇస్తామని తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డికి వినతి

అశ్వారావుపేటరూరల్: హైదారాబాద్‌లో రాష్ట్ర రెవెన్యూ శాఖ, వ్యవసాయ శాఖ మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నియోజకవర్గంలోని దమ్మపేట, చంద్రుగొండ మండలాలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలను మంజూరు చేయాలని సీఎంను కోరారు. మాజీ కేంద్ర మంత్రి రేణుకా చౌదరి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

బూర్గంపాడు: మోరంపల్లిబంజర గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పాల్వంచ నుంచి బూర్గంపాడు వైపుకు వస్తున్న మోటార్‌సైకిల్ అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టింది. ఈ ఘటనలో మోటార్‌సైకిల్ నడుపుతున్న నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన యడమకంటి శ్రీనివాసరెడ్డి అలియాస్ గాంధీ తలకు తీవ్ర గాయమైంది. అతనిని స్థానికులు 108లో భద్రాచలం తరలించారు. మోటార్‌సైకిల్ వెనుక కూర్చున్న అదే గ్రామానికి చెందిన మిర్యాల సందీప్‌కు కూడా గాయాలయ్యాయి. అతనికి భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సలు అందిస్తున్నారు.

ఇండక్షన్ స్టౌవ్ వితరణ

చర్లరూరల్: మండలంలోని కొయ్యూరు ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం యస్‌కేయస్ చారిటీస్ చైర్మన్ షేక్ షాజహాన్, ముంతాజ్ దంపతులు రూ.5 వేల విలువ చేసే ఎలక్ట్రిక్ ఇండక్షన్ కుకింగ్ టాప్‌ను గురువారం ఆస్పత్రి సిబ్బందికి అందజేశారు. షాజహాన్ దంపతులను వైద్య సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

స్క్రాప్ తరలింపు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో కొన్నేళ్లుగా పేరుకుపోయిన పాత ఫర్నీచర్, ఇతర సామగ్రిని ఇటీవల వేలం ద్వారా విక్రయించారు. ఈ మేరకు సామగ్రిని కార్యాలయం నుంచి గురువారం తరలించగా, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్, అధికారులు పరిశీలించారు. ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ పాల్గొన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

గుండాల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని విశ్వకర్మ యోజన జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకుడు ఆకుల నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఆళ్లపల్లి మండలంలోని ఇప్పనపల్లి, తీగలంచ గ్రామాల్లో పల్లెకు పోదాం.. గావ్ చలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల వృత్తులకు సరైన గౌరవం దక్కకపోవడం కోసం నరేంద్ర మోదీ సారథ్యంలో కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. దీనిద్వారా కుల వృత్తిదారుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందుతుందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు నోముల వజ్రేశ్వర రావు, మధుసూదనాచారి, కంకటి ఐలయ్య, ఈసం లక్ష్మయ్య, గోగ్గిల లక్ష్మయ్య, వెంకయ్య, ఈసం చంద్రకళ, ఈసం అబ్బయ్య, చీమల రామారావు, నరసమ్మ, కారం రాధమ్మ , ఈసం కౌసల్య, మోకాళ్ల నాగేశ్వరరావు, ఈసం రామయ్య, మోకాల సుశీల, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

మణుగూరురూరల్: చేతివృత్తుల వారి కోసం కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ యోజన పథకానికి దరఖాస్తు చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ముస్కు శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గురువారం మణుగూరులోని బీజేపీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ అసెంబ్లీ ప్రవాస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఇంటికి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేర్చి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని అన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంపన సీతారామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపాముల ఐలయ్య, నియోజకవర్గ కన్వీనర్ పున్నం బిక్షపతి, జిల్లా కార్యదర్శి ముత్యాల వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మణుగూరుటౌన్: సింగరేణి సేవా సమితి, సింగరేణి వైద్య ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో విప్పలసింగానం గ్రామంలో గురువారం సింగరేణి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు శేషగిరిరావు 205 మంది స్థానిక ప్రజల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని మందులు అందించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ సౌందర్యవతి, పంచాయతీ కార్యదర్శి ఏ ప్రసాద్, మాజీ సర్పంచ్ పాలవ్వంచ ఈశ్వరమ్మ, మాజీ ఉప సర్పంచ్ గోరంట్ల కనకయ్య తదితరులు ఉన్నారు.

ప్రతిభ విద్యాలయంలో..

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని ప్రతిభ విద్యాలయంలో గురువారం కొత్తగూడెంలోని అగిస్ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. విద్యాలయంలోని పిల్లలకు డాక్టర్ పి.కవిత దంత పరీక్షలను చేశారు. విద్యార్థులకు పేస్ట్, మౌత్‌వాష్ ఉచితంగా పంపిణీ చేశారు. అవసరం ఉన్న పిల్లలకు కొత్తగూడెంలో వైద్యం అందిస్తామని డాక్టర్ కవిత తెలిపారు. ఈ శిబిరంలో ఉపాధ్యాయులు పర్వీన్, షబాన, తాతరావు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం..



మణుగూరుటౌన్: ప్రజలకు వైద్యసేవలందిస్తున్న ఏరియా ఆస్పత్రి వైద్యుడు శేషగిరిరావు

అశ్వాపురం: మండల పరిధిలోని గొందిగూడెం కొత్తూరు గ్రామంలో ప్రజలు విషజ్వరాలు, కీళ్ల సంబంధిత వ్యాధితో బాధపడుతుండటంతో గురువారం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ జి.అరుణ ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆయుర్వేద మందులు అందజేశారు. శిబిరంలో రక్తహీనత పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను, వాతావరణ మార్పుల ద్వారా వచ్చే వ్యాధులు, గృహ వైద్య చిట్కాలపై వైద్యాధికారి అరుణ గిరిజనులకు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, ఎఫ్‌ఆర్‌ఓ ఎస్.రమేష్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేయాలి

అశ్వాపురం: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ స్వర్ణలత అన్నారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామ పంచాయతీలో గురువారం ప్రత్యేక అధికారి, తహసీల్దార్ స్వర్ణలత ఆధ్వర్యంలో ప్లాస్టిక్ రహిత సమాజం అంశంపై ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం మల్టీపర్పస్ వర్కర్స్‌ను, పంచాయతీ కార్యదర్శిని తహసీల్దార్, ఎంపీటీసీ నరేష్ శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకం నిషేధించే దిశగా అందరూ సమన్వయంతో పని చేయాలని, ప్రజలు సహకరించాని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, ఎంపీటీసీ కమటం నరేష్, హెచ్‌ఎం కనకమహాలక్ష్మి, అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు, గ్రామపెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

దమ్మపేట: తెలికపాటి ప్లాస్టిక్ కవర్లు, తదితర ఉత్పత్తుల వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని కోరుతూ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గురువారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో, దమ్మపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ప్లాస్టిక్ నిషేధ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కార్యదర్శి మాట్లాడుతూ.. నిత్య అవసరాల్లో తేలికపాటి ప్లాస్టిక్ సంబంధిత ఉత్పత్తులకు బదులుగా వేరే వస్తువులను వినియోగించాలని సూచించారు. ఇళ్లు, వీధుల్లో ఉన్న చెత్తను తొలగించి, గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలన్నారు.



దమ్మపేట: గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో విద్యార్థుల ర్యాలీ..

గెజిటెడ్ ఆఫీసర్ల సభ్యత్వ నమోదు



దేవస్థానం ఈఓ రమాదేవికి సభ్యత్వం అందిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

భద్రాచలంఅర్బన్: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని భద్రాచలంలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా భద్రాచలం దేవస్థానం ఎగ్జిక్యూటివ్ అధికారిణి ఎల్.రమాదేవి, జైలు సూపరింటెంట్ కె.ఉపేంద్ర, ఏటీఓ విష్ణురావు, సబ్ ట్రెజరీ పి.సుభద్ర, జూనియర్ లెక్చరర్ కుర్షిద అహ్మద్‌లతోపాటు పలువురు రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల భద్రాచలం ప్రొఫెసర్లకు సభ్యత్వాన్ని అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డాక్టర్ బి.విజయ్ కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు బానోతు దస్రు, కోశాధికారి కస్తాల వెంకటేశ్వరరావు, పోచలరావు, కుర్షిదా అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంపై పర్యవేక్షణ కరువు!

అన్నపురెడ్డిపల్లి: నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం గురుకులాలను నెలకొల్పింది. అన్నపురెడ్డిపల్లిలో కూడా 1989లో సాంఘిక సంక్షేమ బాలుర గురుకులాన్ని స్థాపించగా ఎందరో విద్యాబుద్ధులు నేర్చుకొని ఉన్నత స్థాయికి చేరారు. అయితే, ఇప్పుడు అధికారులు, ఉపాధ్యాయుల పర్యవేక్షణ లోపించడంతో విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపిస్తుందని తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నపురెడ్డిపల్లి గురుకులంలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు 572 మంది విద్యార్థులు చదువుతుండగా, విద్యార్థులు పలువురు సాయంత్రం బయటకు వచ్చి తిరుగుతున్నారని చెబుతున్నారు. కొందరు చెడు అలవాట్లకు బానిసలు కాగా, ఇటీవల విద్యార్థుల మధ్య గొడవ జరిగిందని సమాచారం. ఉపాధ్యాయులు ఎక్కువ మంది దూరప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తుండడం, వర్గాలుగా విడిపోవడంతో పర్యవేక్షణ కొరవడిందని తెలుస్తోంది. గతంలో ఈ గురుకులంలో ఓ ఉపాధ్యాయురాలు ఆత్మహత్య చేసుకోగా, ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేసి, మరో ఉపాధ్యాయుడుపై కేసు కూడా నమోదు చేశారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడే హడావుడి చేసే ఉన్నతాధికారులు ఆతర్వాత పట్టించుకోకపోవడంతో సమస్యలు రాజ్యమేలుతున్నాయనే ఆరోపణలున్నాయి.

ఇకనైనా గురుకుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు వివరణ కోరగా విద్యార్థుల నడవడికపై దృష్టి సారించి, క్రమశిక్షణ తప్పితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విషయంలో తల్లిదండ్రులు కూడా సహకరించాలని కోరారు.

ప్రభుత్వ కళాశాలకు వితరణ

భద్రాచలంఅర్బన్: లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల అధినేత దివంగత మాగంటి సూర్యం కుమారులు భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ ల్యాబ్, కళాశాల కార్యాలయం వద్ద రూ.లక్షా 50వేల వ్యయంతో పీఓపీ సీలింగ్‌ను గురువారం ఏర్పాటు చేశారు. కళాశాల తరగతి గదుల్లో ప్రతి ఏటా కావాల్సిన విద్యుత్తు ట్యూబ్ లైట్లను ఏర్పాటు చేస్తున్నారు.

కళాశాల ప్రధాన గేటుకు ప్రతి సంవత్సరం పెయింటింగ్ వేయించి సహకరిస్తురు. ఆర్వో ప్లాంట్‌ను సొంత నిధులను వెచ్చించి పిల్లల తాగునీటి ఇక్కట్లను తొలగించే ప్రయత్నంలో ఉన్నారు. ఈ సందర్భంగా గురువారం లిటిల్ ఫ్లవర్స్ జూనియర్ కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ మాగంటి రమేష్ బాబును ప్రభుత్వ కళాశాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.కృష్ణవేణి, సీనియర్ అధ్యాపకులు ఖుర్షీద్ అహ్మద్, వర రాజు, లైబ్రేరియన్ పోచాలరావు, లిటిల్ ఫ్లవర్స్ జూనియర్ కళాశాల మ్యాథ్స్ అధ్యాపకుడు బషీర్ తదితరులు పాల్గొన్నారు.



మాగంటి రమేష్ బాబును సన్మానిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్



దమ్మపేట: తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

దమ్మపేట: మండల కేంద్రం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌గా శ్రీనివాసరావు నూతనంగా బాధ్యతలను గురువారం స్వీకరించారు. పలు పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఆయనను శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు.

ట్రాఫిక్ ఎస్సైగా మధు ప్రసాద్..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ మధు ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత కాలం టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై విధులు నిర్వహించిన ఆయన ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మధుప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నిడపాలని సూచించారు.

సంత్ సేవాలాల్ జయంతి

బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని బంజార నాయకులు సంత్ సేవాలాల్ మహారాజ్‌కు ప్రత్యేక పూజా కార్యక్రమాలను జరిపించారు. భోగ్ బండారం కార్యక్రమం నిర్వహించి, నైవేద్యాలు సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాల్లో పలు సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



అన్నపురెడ్డిపల్లి: సంత్ సేవాలాల్ మహారాజ్‌కు పూజలు చేస్తున్న బంజారాలు



అశ్వారావుపేటరూరల్: సేవాలాల్ జయంతి వేడుకల్లో బంజారాలు



మణుగూరురూరల్: సంత్ సేవాలాల్‌కు పూజలు చేస్తున్న దృశ్యం